www.methukuseema news

Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :10 | ఆదివారం | 24 నవంబర్ 2024

Published from : Hyderabad,Sanagareddy

పేజీలు :04 వేల : 5.00




# 25న బీసీల సమరభేరి

- జనగణనలో కులగణన చేపట్టాలి-
- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్,నవంబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 25న రవీంద్రభారతి వేదికగా బీసీల సమరభేరి సదస్సు నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేరోజులో బిల్లు పెట్టి ఆగమేఘాలపై 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించిన బీజేపీ సర్కారు  బీసీలు ఏండ్లుగా పోరాడుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. బీసీల కోసం కేంద్రస్థాయిలో ఒక పథకాన్ని కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. చట్టసభల్లో, ఉద్యోగ ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, క్రీమీలేయర్‌ను తొలగించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమరభేరి సదస్సుకు బీసీలు, కులసంఘాల ప్రతినిధులు భారీగా తరలిరావాలని కోరారు.

# ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీ మెజర్స్ ను సమీక్షించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ



హైదరాబాద్,నవంబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : శనివారం ఉదయం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని ఓ దవాఖానలో ఫైర్ యాక్సిడెంట్ జరిగి పిల్లలు చనిపోయిన ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు బాధాకరం అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్ ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అదికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ దవాఖాన్లలో ఫైర్ సేఫ్టీపై తనిఖీలు చేసి, నివేదిక తయారు చేయాలని సూచించారు. తనిఖీల కోసం వెంటనే పది బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందాలు తొలుత గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి పెద్ద హాస్పిటళ్లలో తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఫైర్ అలార్మ్, స్మోక్ డిటెక్టర్స్ ఉన్నదీ, లేనిది పరిశీలించాలన్నారు. మంటలను ఆర్పే యంత్రాలు సరిపడా ఉన్నాయో? లేవో చూడాలని, వాటి తుది గడువు తేదీలను చెక్ చేయాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ, మంటలను ఆర్పే యంత్రాల వినియోగంపై హాస్పిటళ్లలో పనిచేసే సెక్యూరిటీ, ఇతర సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వాలని ఆదేశించారు. బి హాస్పిటళ్లలో పవర్ సప్లై సిస్టమ్‌ను పరిశీలించాలని, పాత ఎలక్ట్రిక్ కేబుల్స్ ఉంటే, వాటి స్థానంలో, నాణ్యమైన కొత్త కేబుల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ, షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించి డస్, డోంట్స్ సైన్ బోర్డ్స్ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు సమీపంలోని ఫైర్ స్టేషన్ సిబ్బందితో హాస్పిటల్ అధికారులు టచ్‌లో ఉండాలని, హాస్పిటల్స్‌లో రెగ్యులర్‌గా ఫైర్ సేఫ్టీ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి హాస్పిటల్‌కు  ఫైర్ ఎవికేషన్  ప్లాన్ రూపొందించాలని, ఆ ప్లాన్‌పై డాక్టర్లు, స్టాఫ్‌కు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ఫైర్ ఎవికేషన్ ప్లాన్‌కు సంబంధించిన సైన్ బోర్డులను హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేయాలన్నారు.

# హైదరాబాద్ లో ప్రజలు త్రాగునీటి కోసం కష్టాలు పడకూడదు



హైదరాబాద్,నవంబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : ఇకనుండి హైదరాబాద్ ప్రజలు త్రాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదు అని తెలంగాణ కోర్ అర్బన్ రీజన్ హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలించడానికి సంబంధించి సమగ్రమైన నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఇందుకు వచ్చే నెల 1 వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియకు కార్యాచరణను రూపొందించాలని చెప్పారు. జంట నగరాల తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలింపు అంశంపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి నీటి పారుదల శాఖ, జలమండలి అధికారుల సమావేశంలో సమీక్షించారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపు ప్రణాళికలపై నివేదిక తయారు చేయాలని సూచించారు. నీటి లభ్యత, ఏ ప్రాజెక్టు నుంచి ఎంతమేరకు నీటిని తరలించాలి, ఎంత ఖర్చవుతుందన్న విషయాలపై పూర్తి అధ్యయనం జరగాలని ఆదేశించారు.ఈ విషయంలో మిషన్ భగీరథ అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలని చెప్పారు.

# గెలుపు అనంతరం మల్లికార్జున ఖర్గేను కలిసిన ప్రియాంక గాంధీ

- పరస్పరం మిఠాయి తినిపించుకున్న ప్రియాంక, ఖర్గే
- ప్రియాంక వయనాడ్, దేశం తరపున గళమెత్తుతారన్న ఖర్గే
- మహారాష్ట్ర ఫలితాలపై కారణాలను అన్వేషిస్తున్నట్లు వెల్లడి



హైదరాబాద్,నవంబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : కేరళలోని వయనాడ్ లోక్ సభ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ప్రియాంక గాంధీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. వయనాడ్‌లో ప్రియాంక 4 లక్షల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. ఈ గెలుపు అనంతరం ఖర్గేను కలిశారు. ఇరువురు పరస్పరం మిఠాయి తినిపించుకున్నారు. అనంతరం ప్రియాంకకు ఖర్గే శాలువా కప్పి అభినందించారు. ఓ చిన్నారితో ప్రియాంకకు పుష్పగుచ్ఛం ఇప్పించారు. పార్లమెంట్‌లో ప్రియాంక గాంధీ వయనాడ్, దేశం తరఫున గళమెత్తుతారని ఖర్గే పేర్కొన్నారు. ఆమె చురుకైన నాయకత్వం, కరుణ, దయ, సంకల్పం, నిబద్ధత ప్రజాస్వామ్యానికి మరింత దోహదపడతాయన్నారు. వయనాడ్‌లో తమను ఎన్నుకున్నందుకు ప్రజలకు ఆయన కృతజ్ఞత తెలిపారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఊహించలేదని ఖర్గే అన్నారు. ఈ ఓటమికి గల కారణాలపై అన్వేషిస్తున్నట్లు చెప్పారు. ఛత్రపతి శివాజీ, అంబేద్కర్ సిద్ధాంతాలకు తాము నిజమైన ప్రతినిధులం అన్నారు. తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఝార?ండ్ ప్రజలు తమ హక్కులు, నీరు, అడవులు, భూసమస్యలకు ప్రాధాన్యం ఇచ్చారని, అందుకే తమ కూటమికి విజయాన్ని అందించారన్నారు. తప్పుడు రాజకీయాలను తిప్పికొట్టారన్నారు.

# ఈ గెలుపు మరింత ఉత్సాహాన్నిచ్చిందన్న నడ్డా



హైదరాబాద్,నవంబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికలు జరిగిన చోట మెజార్టీ సీట్లు బీజేపీ కూటమి గెలుచుకోవడం పట్ల ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హర్షం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర చారిత్రక విజయం, ప్రధాని మోదీ సాధించిన విజయాలు ప్రపంచవ్యాప్తమయ్యాయన్నారు. ఈ గెలుపు మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్లేలా చేసిందన్నారు. ఈరోజు మహారాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు... మోదీ ప్రజాసేవకు ఫలితం అన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమిపై నడ్డా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్న వారికి మహారాష్ట్ర ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. కులం, మతం పేరుతో భారత సమాజాన్ని విడదీయాలని ఇండియా కూటమి చూస్తోందని, కానీ ఎవరేమిటనేది ప్రజలకు తెలుసునన్నారు. నిన్నటి హర్యానా, నేటి మహారాష్ట్ర ఫలితాలు ఎవరేమిటనేది చెప్పాయన్నారు. మహారాష్ట్ర ప్రజలు బీజేపీకి అనుకూలంగా ఇప్పుడు మాత్రమే తీర్పు ఇవ్వలేదని, 2019లోనూ అలాగే ఇచ్చారన్నారు. ఉద్ధవ్ ఠాక్రే పదవీ కాంక్ష, వెన్నుపోటుకు ప్రజలు ఈరోజు బుద్ధి చెప్పారన్నారు. ఆయన స్థానం ఏమిటో ఓటు రూపంలో చూపించారన్నారు. ఈ ఎన్నికల ద్వారా మరో విషయం తెలిసిందని, కాంగ్రెస్ తాను బలహీనపడటంతో పాటు తన కూటమి పార్టీలను కూడా బలహీనపరిచిందని తేలిపోయిందన్నారు.

# కేటీఆర్ పై నాంపల్లి స్పెషల్ కోర్టులో క్రిమినల్ పిటిషన్



హైదరాబాద్,నవంబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై హైదరాబాద్ నాంపల్లి స్పెషల్ కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలయింది. ఈ పిటిషన్ ను వ్యాపారవేత్త సృజన్ రెడ్డి వేశారు. అమృత్ టెండర్ల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా తనపై కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేశారని సృజన్ రెడ్డి తెలిపారు. 2011లో శోధ కన్ స్ట్రక్షన్స్ ప్రారంభమయిందని... దీనికి ఎండీగా దీప్తిరెడ్డి వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఆ కంపెనీలో తనకు షేర్లు లేవని... తాను కనీసం డెరెక్టర్ గా కూడా లేనని తెలిపారు.ఆ సంస్థతో తనకు లింక్ పెట్టి కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమృత్-2లో ప్యాకేజీ-1 కాంట్రాక్ట్ ను ఏఎంఆర్, శోధ, ఐహెచ్ పీ సంస్థలు జాయింట్ వెంచర్ కింద దక్కించుకున్నాయని సృజన్ రెడ్డి తెలిపారు. కేటీఆర్ చెపుతున్నట్టు జాయింట్ వెంచర్ లో శోధకు 80 శాతం కాకుండా 29 శాతం మాత్రమే వాటా ఉందని చెప్పారు. ఆన్ లైన్లో టెండర్లను పిలిచారని, పారదర్శకంగానే కేటాయింపులు జరిగినప్పటికీ... కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కేవలం తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. లీగల్ నోటీసులు ఇచ్చినా కేటీఆర్ తీరు మార్చుకోలేదని... అందుకే క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశానని తెలిపారు.

# చెరువులోకి చేపపిల్లలను వదిలిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సదాశివపేట్,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : చెరరువులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులకు అన్ని రకాల చేపపిల్లలను సకాలంలో అందజేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం సదాశివపేటలోని ఊబ చెరువులో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్థానిక బిఆర్ఎస్ నేతలతో కలసి 28 వేల చేపపిల్లలని చెరువులోకి వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మత్స్యకారులకు 100 శాతం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయగా అప్పుడు నీలి విప్లవంగా చర్యలు చేపట్టి మత్స్యకారులకు చేతి నిండా పని కల్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అందులో 50 శాతం మాత్రమే చేప పిల్లల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నదని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు ఆరోపించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఈ సంవత్సరం పది చెరువులకు మాత్రమే చేపపిల్లల పంపిణీకి 10 లక్షల విత్తనానికి విలువ రూ. 17 లక్షల విలువతో పంపిణీ గావిస్తున్నారు, 40 సొసైటీ లకు గాను 2216 మంది లబ్ది పొందుతున్నారు. అయితే గత బీ ఆర్ యస్ ప్రభుత్వంలో ప్రస్తుతం కేటాయించిన దానికి కంటే రెట్టిపుగా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారులకు అర్థికంగా ఇబ్బంది పడే విదంగా చర్యలు ఉన్నాయి. వృత్తిపై ఆధారపడిన మత్స్యకారులకు ఉపాధి మీద దెబ్బకొట్టిన విధంగా ప్రస్తుత ప్రభుత్వం తీరు ఉంది. కావున ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి మత్స్యకారుల సంక్షేమం దృష్టిలో ఉంచికొని తగు చర్యలు తీసుకోగలరని ఎమ్మెల్యే గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాజ్ పాటిల్, ఫిషరీస్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, కౌన్సిలర్లు సాతని శ్రీశైలం, ఇంద్రమోహన్, నాయకులు ముబీన్, నసిర్, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు చాపల హనుమంతు, నల్ల సుధాకర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

---

# కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి



నారాయణఖేడ్,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : మండలం చల్లగిద్ద తండాకు చెందిన బిఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు సర్దార్ నాయక్ తల్లి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నాయక్, రామ్ సింగ్ నాయక్, జానకిరామ్, బన్సీలాల్, సంక్షిత్, నర్సింగ్,పుండ్లిక్ తదితరులు ఉన్నారు.

---

# మార్షల్ ఆర్ట్స్ బాలికల ఆత్మ రక్షణ ఎంతో అవసరం

**- స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**



హత్నూర,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : మార్షల్ ఆర్ట్స్ ఉష్మ వంటి ఆత్మ రక్షణ విద్య పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయిలో గెలుపొందడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడం అమ్మాయిలలో అరుదైన విషయమని, ఇలాంటి విజయాలు సాధిస్తూ అమ్మాయిలు ముందుకు రావాలని స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని సిరిపుర గ్రామానికి చెందిన కాలే నాగేశ్వరి, ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ ఉష్మ పోటీలో పాల్గొని బంగారు పతకం సాధించింది. దీంతో పంజాబ్ రాష్ట్రంలో డిసెంబర్ ఒకటి నుంచి ఆరవ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి శనివారం ఆమెను సన్మానించి జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఆర్థికంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామ మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పోచయ్య, వీరేశం తదితరులు ఉన్నారు.

---

# ప్రజా పాలన విజయోత్సవాలకు చేదు అనుభవం



పుల్కల్,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతటా రహదారులపై, గ్రామాల్లో, పల్లెల్లో ప్రజా పాలన ప్రచార రథాని తిప్పుతూ కళాకారులతో కళా ప్రదర్శన చేయిస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ప్రజాపాలన ప్రజా విజయవత్సవాల కళాకారుల వాహనాన్ని సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని ప్రజలు అడ్డుకున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చకుండానే విజయోత్సవాలు ఏమిటంటు ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తానన్న కాంగ్రెస్ పార్టీ ఎంతమంది రైతులకు రుణమాఫీ చేసిందని అక్కడున్న గ్రామస్తులు ప్రజా పాలన కళాకారులను ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మి, తులం బంగారం, సన్న వడ్ల కు బోనస్, మహిళలకు 2500 రూపాయల పింఛన్ డబ్బులు ఏమయ్యాయి అని నిలదీశారు. ఆగ్రహించిన గ్రామస్తులు ప్రజా పాలన ప్రదర్శన చేస్తున్న కళాకారులను అక్కడి నుండి తిప్పి పంపించారు. చేసేదేమీ లేక కళాకారులు అక్కడి నుండి వెన్ను తిరిగి వెళ్లిపోయారు.

# హైమాక్స్ లైట్లు ప్రారంభించిన వైస్ చైర్మన్ చింతా గోపాల్



సదాశివపేట,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావు నిధులతో సదాశివపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లను శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివరాజ్ పాటిల్ లు కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో గాంధీ చౌక్ వద్ద, శ్రీకృష్ణ నగర్ కాలనీ ఆరవ వార్డులో ప్రజల సౌకర్యంతో హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐమాక్స్ లైట్ల ఏర్పాటుకు కృషి చేసిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ లు సాతాని శ్రీశైలం, ఇంద్రమోహన్ గౌడ్, ఆకుల శివ, ప్రకాష్, శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు మోబిన్, నాగుల విజయకుమార్, ఖాజా, బరాడి శివ, మంబిగారి ఆంజనేయులు, నాగరాజ్, నాసర్, తదితరులు పాల్గొన్నారు.

---

# సీఎం సహాయనిధి చెక్కు అందజేతచేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి




నర్సాపూర్,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : సీఎం సహాయ నిధి పథకం ద్వారా పేదలకు ఎంతో లబ్ధి చేగూరుతుందని ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునితారెడ్డి సూచించారు. నర్సాపూర్ బ్యాగరివాడకి కి చెందిన నజీమాబేగం గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన రూ. 60,000/- అరవై వేల రూపాయల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యం గౌడ్, గూడూరు యాధా గౌడ్, మర్రి మహేందర్ రెడ్డి, షేక్ హుస్సేన్, ప్రసాద్, షేక్ లాయక్, రాజేష్ జగుపతి, ఆనంద్ కుమార్, సామ్యా నాయక్, బెస్త లక్ష్మణ్, అందూరి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

---

# బిటి విత్తనాలను ప్రవేశ పెట్టొద్దు

**- ఎంపీ రఘునందన్ రావు కు వినతి**



మెదక్,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : బిటి విత్తనాలను భారతదేశంలో ప్రవేశపెట్టకుండా పార్లమెంట్ లో బిల్లు తీసుకురావాలని భారతీయ కిసాన్ సంఘ్ జోనల్ ప్రెసిడెంట్ రాజా శ్రీకాంత్ రెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మెంగర్తి అనిల్ కుమార్, చుక్కల మైసయ్య లు డిమాండ్ చేశారు. రాబోయే పార్లమెంట్ లో బిటి విత్తనాలపై ప్రస్తావించాలని కోరుతూ శనివారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజలు అనారోగ్యభారిన పడకుండా ఉండాలంటే దేశంలోకి బిటి విత్తనాలను అనుమతించవద్దన్నారు. బిటి విత్తనాలపై తీవ్ర నష్టం ఉందనే విషయాన్ని పార్లమెంట్ లో ప్రస్తావించాలని వారు ఎంపీ ని కోరారు. వారి విజ్ఞప్తి పై ఎంపి సానుకూలంగా స్పందించారని అన్నారు.

---

# ప్రజా సమస్యల పరిష్కారాని కై సీపీయం పార్టీ ఉద్యమాలను బలపరచండి




కొండాపూర్,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : కొండాపూర్ మండలంలోని తేర్పోల్ గ్రామంలో సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఇంటింటికి సీపీయం విరివిరిగా విరాళాలు అందజేసి పార్టీని బరపరచాలని సీపీయం పార్టీ మండల కార్యదర్శి కే రాజయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలలో పని కల్పించి, అసంఘటిత కార్మికులను ఫార్మాట్ చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలను వెంటనే ప్రజలకు అందే విధంగా అమలు చేయాలని గత రెండు సంవత్సరాల వృద్ధులు వితంతువులు అవకాశమున్న గాని గ్రామాలలో చాలా ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుంది కాబట్టి ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని సీపీయం పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో సీపీయం పార్టీ మండల కమిటీ సభ్యులు బాబురావు నాయకులు వెంకటేశం, సుదర్శన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# హలో బీ.సీ చలో హైదరాబాద్

**- నవంబర్ 25న బీ.సీ ల సమరభేరి**
**- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ మూర్తి**



కొండాపూర్,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్ లో బీ.సీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీ.సీ లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీ.సీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు నవంబర్ 25 న రవీంద్రభారతి వేదికగా బీ.సీ ల సమరభేరి సదస్సు సదస్సుకి బీ.సీ యువత అధిక సంఖ్యలో తరలి రావాలని బీ.సీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ మూర్తి పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాదం లో ఒక్కరి మృతి ఇద్దరి గాయాలు



సంగారెడ్డి,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వెంకట సాయి హోండా షోరూం ఆపోజిట్ మెయిన్ రోడ్డు కంది నుంచి సంగారెడ్డి చౌరస్తా కు వచ్చే దారిలో రాయల్ ఎన్ఫీల్డ్ బైకుపై వెళ్తున్న ముగ్గురు అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికీ గాయాలు అయ్యాయి. ఇద్దరిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ చిరంజీవి పైలట్ జగదీష్ సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## గంజాయి మొక్కలు సాగు చేసిన వ్యక్తికి ఐదేళ్లు జైలు శిక్ష

**- రూ. 25,000 జరిమానా**



మునిపల్లి,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేస్తే పదోపరకు ఆదాయం వస్తుందని, పంటతోపాటు పంట చేనులో గంజాయి మొక్కలు సాగిస్తే లక్షల లాభం గడించవచ్చునని భావించిన వ్యక్తికి సంగారెడ్డిలో ఐదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ. 25000 జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దలోని గ్రామంలో మంగలి వెంకటేశం అనే వ్యక్తి గంజాయి సాగు చేశాడు. 2018 నవంబర్ 6న ఎక్సైజ్ సీఐ మధుబాబు సిబ్బందితో దాడి చేసి 36 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సాగు చేసిన వ్యక్తిపై నమోదు చేసిన కేసు శనివారం సంగారెడ్డి జిల్లాలోని ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి శ్రీమతి జయంతి గంజాయి సాగు వెంకటేశ్వర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 25000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. గంజాయి సాగు చేసిన వ్యక్తికి శిక్ష పడడానికి అన్ని రకాల చర్యలు చేపట్టిన ఎక్సైజ్ సీఐ మధుబాబు తో పాటు సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వి.బి. కమలహాసన్ రెడ్డి, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కే ఏ బి శాస్త్రి, అభినందించారు.

## మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు

**- మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలతో మరోసారి స్పష్టం**
**- బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**



సంగారెడ్డి,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి మరోసారి ఘన విజయం సాధించడం పట్ల భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ మరోమారు అధికారం చేపట్టనున్నట్లు ఆమె చెప్పారు. ప్రధాని మోదీపై నమ్మకం, దేశాభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మహారాష్ట్ర రాష్ట్ర ప్రజలు మంచి విజయాన్ని అందించినట్లు తెలిపారు. దేశ ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు అనేందుకు ఈ ఫలితాలు నిదర్శనం అని పేర్కొన్నారు. ఇండియా కూటమి ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను మహారాష్ట్ర ప్రజలు తిరస్కరించారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదనే విషయం మహారాష్ట్ర ప్రజలు అర్థం చేసుకొని... ఇండియా కూటమిని ఓడించారని స్పష్టం చేశారు. మహా ప్రజలు పార్టీపై నమ్మకం ఉంచడం సంతోషకరమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ కాంగ్రెస్ కు ఓటమి తప్పదని గోదావరి అంజిరెడ్డి చెప్పారు. గ్యారెంటీల పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంత రావు, కులకర్ణి కొల్కురి రాజశేఖర్ రెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్, జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : కొండాపూర్, సంగారెడ్డి మండలానికి చెందిన సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కొండాపూర్, సంగారెడ్డి మండలాలకు చెందిన 53 మంది లబ్దిదారలకు విలువ రూ. 1768500 చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే కృషితో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయించడంపై లబ్ధిదారులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కసాల బుచ్చిరెడ్డి, జైపాల్ రెడ్డి, విజేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు విఠల్, పాండు, చక్రపాణి, నర్సింలు, జీవ శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, లబ్దిదారులు పాల్గొన్నారు.

## సైన్స్ తోనే అభివృద్ధి సాధ్యం - ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా కీర్తిని ప్రసిద్ధి చెందేలా విద్యార్థులు కృషి చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సెంట్ ఆంథోనీ పాఠశాలలో మూడు రోజుల పాటు పండుగ వాతావరణంలో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరయ్యారు. అనంతరం ఎన్సి సి పరేడ్ తో వైభంగా ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన లో మొత్తం 706 ప్రదర్శనలకు గాను 30 ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు గైడ్ టీచర్లకు ప్రశంస ప్రత్రం మెమోంటోనూ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ , అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు మాట్లాడుతూ ఐఐటీ హైదరాబద్ లో విద్యార్థులు డ్రైవర్ లేని కారును తయారు చేసి ఆవిష్కరించడం మన జిల్లాకే గర్వకారణం అని ఆన్నారు. డ్రోన్ ద్వారా వ్యవసాయ క్షేత్రంలో రసాయణాను వెదజల్లే విధంగా రూపు దిద్దడం ఎంతో గర్వకారణం ఎదేశంలో అయినా సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి చెందుతుందో ఆ దేశ కీర్తి ప్రతిష్టలు ఉన్నతంగా ఉంటాయి అని అన్నారు.

## ఇందూరు శ్రీనివాస్ రెడ్డి మరణం పట్ల ప్రగాఢ సానుభూతి

**- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్యరావు**



జహీరాబాద్,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఇందూర్ విజయేందర్ రెడ్డి సోదరుడు ఇందూర్ శ్రీనివాస్ రెడ్డి ( స్వామి) కంకొల్ జాతీయ రహదారి వాక్సన్ బిజినెస్ స్కూల్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు శ్రీ కోనింటీ మాణిక్ రావు స్థానిక ఏరియా ఆస్పత్రికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొని అనంతరం వారి కుటుంబసభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, బి అర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బైకును ఢీ కొట్టిన కారు అయ్యప్ప భక్తుడు దుర్మరణం




మునిపల్లి,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : మునిపల్లి మండలం కంకోల్ శివారులోని 65వ జాతీయ రహదారిపై వెనుక నుంచి బైకును కారు ఢీ కొట్టడంతో బైక్ పై వెళ్తున్న అయ్యప్ప భక్తుడు అక్కడికక్కడే మృతి చెందిడం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం. జహీరాబాద్ కు చెందిన పట్లోళ్ళ శ్రీనివాస్ రెడ్డి (51) అయ్యప్ప దీక్షలో వున్నాడు. శనివారం సాయంత్రం అతని సన్నిహితుడైన నాగిలే ప్రశాంత్ తో కలిసి సదాశివపేట వైపు వెళ్తున్నారు. కంకోల్ లోని వొక్సన్ యూనివర్సిటీ వద్ద జహీరాబాద్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు శ్రీనివాస్ రెడ్డి బైకును ఢీ కొట్టింది. దీనితో శ్రీనివాస్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.ప్రశాంత్ కు బలమైన గాయాలు కావడం తో చికిత్స నిమిత్తం 108 వాహనంలో సదాశివపేటలోని ఆసుపత్రికి తరలించారు. కాగా బైకును ఢీ కొట్టిన కారు డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ కంకోల్ లో రోడ్డు ప్రక్కన వెళ్తున్న రెండు గేదెలను ఢీ కొట్టాడు.కారు అంతారం, చిన్న చెల్మెడ గ్రామాల మధ్య పట్టుబడినట్టు సమాచారం.

# ధరణి పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- ప్రజావాణి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఫిర్యాదులను పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 23 ( మెతుకు సీమ న్యూస్) : ధరణి మాడ్యూల్స్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి రెవెన్యూ అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లతో ధరణి పెండింగ్ సమస్యలు, ప్రజావాణి, సీఎం ప్రజావాణి, నూతన ఓటరు నమోదు – ఎస్ ఎస్ ఆర్ 2025, తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణి సమస్యల పరిష్కారం, ప్రజావాణి సమస్యల పరిష్కారం, నూతన ఓటరు నమోదు తదితరు అంశాలలో రెవిన్యూ యాంత్రాగం ప్రధాన భూమిక పోషించాలన్నారు. ధరణి మాడుల్స్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే క్లియర్ చేసేలా రెవెన్యూ అధికారులు కృషి చేయాలని అన్నారు. అన్ని మాడ్యుల్స్ లో దాఖలైన ధరణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని మండల తహసీల్దార్లను ఆదేశించారు.ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సక్సేషన్, పెండింగ్ మ్యూ టేషన్ వంటి దరఖాస్తులకు అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.. ప్రజావాణిలో పెండింగ్ దరఖాస్తులు వచ్చే నెల మొదటి వరం లోగా పూర్తీ చేయాలనీ అన్నారు . కొత్తగావచ్చే ప్రజావాణి ధరకాస్తులకన్నా ముందే పాతవాటిని పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు . మండలవారీగా పెండింగ్ ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా రెవెన్యూ అధికారులు కృషి చేయాలని అధికారులకు ఆదేశించారు. అక్రమకట్టడలపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు , చెరువులు ,ప్రభుత్వ భూములను కచ్చితంగా కాపాడాలని అన్నారు , పట్టణాలలో ఎల్ ఆర్ ఎస్ అప్లికేషన్ లను త్వరగా పూర్తిచేయాలని అన్నారు . ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పద్మజారాణి , జిల్లాలోని ఆర్డీవోలు తాసిల్దార్ లో పాల్గొన్నారు.

---

# కళాకారులకు చేయూతనిస్తాం

- తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మన్ డాక్టర్ వెన్నెల




రామచంద్రాపురం,నవంబర్ 23 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్రంలో పల్లె పల్లెకు తిరుగుతూ కళాకారులకు చేయూతనిస్తామని రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ డాక్టర్ వెన్నెల తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ కొల్లూరు భరత్ ఆధ్వర్యంలో తెల్లాపూర్ లోని గద్దర్ చౌక్ వద్ద డాక్టర్ వెన్నెల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ తన తండ్రి ప్రజా గాయకుడు గద్దర్ పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను ఆదరించడం, అవార్డులను ఇచ్చి సత్కరించేందుకు పూనుకోవడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. గద్దర్ ఒక్కడికే కాకుండా యావత్ కళాకారులకు అందరికీ దక్కిన గౌరవంగా భావించాలని అన్నారు. కళాకారులను గౌరవించేందుకు ప్రభుత్వం కృషి చేయడం సాగించదగ్గ విషయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఇతర మంత్రులందరూ తెలంగాణ కోసం పాటుపడిన వారిని దగ్గరకు తీసి నూతన జీవితాన్ని ఇవ్వాలని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా ఒక ప్రణాళికాబద్ధంగా అడవులు వేస్తున్నారని అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన నేను గ్రామాల్లో తిరుగుతూ కళాకారులందరిన చేరదీసి వారికి చేతనిచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. సాంస్కృతిక చైర్మన్ గా నియమితులైన తనను తెల్లాపూర్ కౌన్సిలర్ భరత్ ఆధ్వర్యంలో సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కౌన్సిలర్ భరత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పైరవీలకు తావు లేకుండా పని చేసిన వారిని గుర్తింపు ఇచ్చి పదవులు కట్టబెడుతున్నారని అన్నారు. పల్లె పల్లెల్లో ప్రజలను చైతన్యపరిచేందుకు గద్దర్ చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో మార్పును సాంస్కృతిక విప్లవంతోనే సాధ్యమని గద్దర్ నమ్మేవారని తెలిపారు. గద్దర్ కుటుంబాన్ని గౌరవిస్తూ ఆయన కుమార్తె డాక్టర్ వెన్నెలకు రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ చైర్మన్ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం తెల్లాపూర్ లోని గద్దర్ విగ్రహం వద్ద సాంస్కృతిక చైర్మన్ వెన్నెలను భరత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గద్దర్ విగ్రహానికి వెన్నెల మరియు నాయకులు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, నరసింహ, అరుణ్ గౌడ్, శ్రీనివాస్, గద్దర్ గలం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

- సంగారెడ్డి, అందోల్ ఆర్డిఓ కార్యాలయాలు తనిఖీ
- ప్రత్యేక ఓటర్ నమోదు పరిశీలన




సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 23 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి కలెక్టరేట్లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ఓటర్ నమోదు, ఎమ్మెల్సీ ఓటర్ నమోదు వివరాలు ఎన్నికల కమిషనర్ కు తెలిపిన కలెక్టర్ క్రాంతి వల్లూరు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి శనివారం జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపెనింగ్ లను జిల్లాలోని సంగారెడ్డి, ఆందోల్ నియోజకవర్గాలలో పర్యటించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి, ఆందోల్ ఆర్డీవో కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి , అందోల్ ఆర్డిఓ కార్యాలయాలలో నూతన ఓటరు పరిశీలించారు. ఆన్లైన్ వేగవంతంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సంగారెడ్డి తార డిగ్రీ కళాశాల లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బిఎల్ఓ లతో మాట్లాడి ఫారం 6, 7, 8 ఆన్లైన్, సాధారణ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి లోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. జిల్లాలో ఎస్ ఎస్ ఆర్ 2025 ఓటరు నమోదు వివరాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు వివరాలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు జిల్లాలోని ఆర్డీవోలు పాల్గొన్నారు.

---

# సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి



శంకరంపేట్,నవంబర్ 23 ( మెతుకు సీమ న్యూస్) : శంకరంపేట్ (ఎ) మండలం జుక్కల్ గ్రామానికి చెందిన జె.అనుసూజ గారి ఆసుపత్రి వైద్య ఖర్చుల కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 33,000 రూపాయలు మరియు రామోజీపల్లి గ్రామానికి చెందిన చిరంజీవికి రూ . 25,000 చెక్కులను లబ్ధిదారులకు నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మండల తాజా మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రమేష్,రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సురేష్ గౌడ్,మాజీ మండల కో ఆప్షన్ యదులా, మాజీ ఎంపీటీసీలు దత్తు, యాకూబ్,మాజీ సర్పంచ్లు నరసింహులు సెట్, కిషన్ సెట్, నాయకులు వెంకట్ రెడ్డి, విట్టల్ గౌడ్, మహమ్మద్ జహంగీర్ తదితరులు ఉన్నారు.

---

# రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన ఉపాధ్యాయుడు






సంగారెడ్డి బ్యూరో,నవంబర్ 24 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి వేదికగా నవంబర్ 21, 22, 23 తేదీలలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న ర్యాలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వినయ్ కుమార్, ఉపాద్యాయుల విభాగానికి చెందిన ప్రదర్శన లో తాను చేసిన గణిత నమూనాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకునేలా వివరించి జిల్లా స్థాయి ప్రథమ స్థానం పొంది, సంగారెడ్డి జిల్లా నుండి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగసుజాత, ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్థులు అభినందించారు.



– యావత్ తెలంగాణ రాష్ట్ర బైండ్ల బంధువులకు మరియు కులస్తులకు తెలియజేయునది ఏమనగా.....

– మన తాతలు, ముత్తాతలు మరియు మన పూర్వీకులు అందరూ కులవృత్తినే నమ్ముకొని ఉండడం వలన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది అంటే ఎలాంటి అభివృద్ధి చెందలేదు ( విద్యాపరంగా, ఉద్యోగ పరంగా,రాజకీయం పరంగా,ఆర్థికంగా & సామాజికంగా) వాళ్ళు జీవితాంతం పేదవారిగానే ఉండిపోయారు.

– తాము కులవృత్తిని నమ్ముకుని రేణుక మాతను పూజిస్తూ, ఆ దేవతను కీర్తిస్తూ, ఆమె కథలు చెప్పుకుంటూ, ఉచితంగా లేదా తక్కువ డబ్బులకు పెళ్లిళ్లు చేస్తూ, కొన్ని ప్రాంతాల్లో తమకు వతను ఉన్న గ్రామాలలో భిక్షాటన కూడా చేశారు.

– వారు జీవితాంతం ఆకలి తీర్చుకునే ప్రయత్నంలో, తన పిల్లల ఆకలి తీర్చే ప్రయత్నంలోనే దొరికిన దానితో సంతోషపడి జీవితాంతం బతికేశారు.

– కొన్ని కొన్ని గ్రామాలలో ప్రభుత్వం బతకడానికి ఇచ్చిన ఇనాం భూములను, తవ్వెడు మానేడు అడ్డెడు గింజలకు అమ్మేయడం, లేదా పిల్లల పెళ్లిళ్ల సమయంలో కొద్దిపాటి డబ్బులకు అమ్మేయడం చేసి ఎలాంటి భూములు చేతిలో లేకుండా ఉండిపోయారు.

– అదే విధంగా అసైన్డ్ భూములను కూడా సాగు చేయకుండా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితిలో కూడా కొందరు ఉన్నారు. వాటిని కూడా అమ్మేసి పరాదీనం చేసిన వారు కూడా ఉన్నారు.

–ఎక్కడ కూడా ఎకరాలు కాదు కదా ఒకటి రెండు కుంటలు కూడా పట్టా భూమిలేని బైండ్ల కులస్తులు చాలామంది సుమారు 98% ఉన్నారు.

– బైండ్ల కుల సంఘం తెలంగాణ యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటంటే ప్రస్తుతం ఉన్న మన బైండ్ల కుల యువకులు మరియు విద్యార్థులు మన తాత ముత్తాతల తరం, తండ్రుల తరం ఎలాగో గడిచిపోయింది. గతాన్ని గుర్తు చేసుకుంటూ బాధపడుతూ బతకడంతో వచ్చేదేమీ ఉండదు.

(1). మన యువకులు మరియు విద్యార్థులు గత చేదు అనుభవాలను గుర్తు చేసుకుంటూ ఆ కారు మబ్బులను చీల్చుకుంటూ అందరూ కాంతిపుంజంలా బాగా చదువుకొని మంచి మంచి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి. ఎందుకంటే ఒక కుటుంబంలో ఒక వ్యక్తికి ఉద్యోగం వస్తే దాని వెలుతురు ఆ కుటుంబం అంతా ప్రసరిస్తుంది. అతడు /ఆమె తన తర్వాత తరాలను కూడా బాగుచేసుకోగలరు.

లేదా

(2). మంచి వ్యాపారం లోనో స్థిరపడి ఆర్థికంగా అభివృద్ధి చెందాలి.

లేదా

(3). సాధ్యమైతే రాజకీయంగా అభివృద్ధి చెందాలి.

– అంటే ఇక్కడ కులవృత్తిని పూర్తిగా మానివేయాలని మేము చెప్పడం లేదు. మంచి ప్రభుత్వ ఉద్యోగం లేదా మంచి వ్యాపారం లేదా మంచి రాజకీయ నాయకత్వం సాధించిన తర్వాత కులవృత్తి కూడా నేర్చుకొని ఉండాలి. అవసరమైనప్పుడు చేయగలగాలి. అంతేగాని కులవృత్తినే ప్రధాన వృత్తిగా ఎంచుకొని బతుకులు నాశనం ందుకని బైండ్ల కుల పెద్దలారా మన తరం ఎలాగో గడిచిపోతుంది. కానీ మన పిల్లల భవిష్యత్తును ఒకసారి ఊహించండి. వారికి చదువు ప్రాముఖ్యతను తెలియజేయండి. ఉద్యోగం సాధించాల్సిన ఆవశ్యకతను తెలియజేయండి. వారిలో ఉన్న చెడు వ్యసనాలను దూరం చేయండి. వారి ముందు మీరు కూడా ఎలాంటి దురలవాట్లకు బానిస కాకండి. మన పిల్లలను బాగా చదివించి వాళ్ళు ఉద్యోగం సాధించే వరకు మన వంతు సహాయం చేద్దాం వారిని ప్రోత్సహిద్దాం.

“ప్రతి బైండ్లోని ఇంట్లో – ఒక ప్రభుత్వ ఉద్యోగం”

ఇదే బైండ్ల కుల సంఘం తెలంగాణ ప్రధాన లక్ష్యం

“మనం సాధించేవరకు విశ్రమించకుండా ఉందాం – మన పిల్లలు సాధించేవరకు ప్రోత్సహిద్దాం”

– ఈ విషయాలన్నీ అర్థం చేసుకొని, మనసు మార్చుకొని, పిల్లల మనసు మార్చి, లక్ష్యం దిశగా ప్రయాణం మొదలు పెడతారని ఆశిస్తూ.....

ఈ మాటలు అర్థం చేసుకుంటారని ఆశిస్తూ.....

మీ
బైండ్ల కుల సంఘం తెలంగాణ




Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com